# ప్రభాత సూర్యుడు
తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :143 EDITOR:CHERUKU UPENDAR, DATE : SATURDAY 07 OCTOBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 143 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శనివారం 07 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## 16న బీఆర్ఎస్ మేనిఫేస్టో ప్రకటన..!

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణలో ప్రధాన పార్టీలు తమ కార్యాచరణ మరింత ముమ్మరం చేశాయి. మేనిఫేస్టోలతో ప్రజలను ఆకర్షించేందుకు అన్ని పార్టీలు కసరత్తు మొదలుపెట్టాయి. ఆరు గ్యారంటీ స్కీమ్‌ల పేరుతో కాంగ్రెస్ ఇప్పటికే మినీ మేనిఫేస్టో ప్రకటించగా.. బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ సయితం మేనిఫేస్టో ప్రకటనకు ముహూర్తం ఫిక్స్ చేశారు. ఇప్పటికే మేనిఫేస్టో కమిటీలను పార్టీలు ప్రకటించాయి. పదేళ్లు పాలించినవారికి మేనిఫేస్టోలతో పనేం

మిగతా 2లో...

### వామపక్ష తీవ్రవాదానికి
## రెండేళ్లలో చరమగీతం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: వామపక్ష తీవ్రవాదానికి రాబోయే రెండేళ్లలో పూర్తిగా చరమగీతం పాడాలని కేంద్రక హెూం మంత్రి అమిత్‌షా అన్నారు. వామపక్ష తీవ్రవాదంపై అమిత్‌షా అధ్యక్షతన శుక్రవారం నాడిక్కడ జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి, జార?ండ్

మిగతా 2లో...



## ఖర్గే, రాహుల్‌ను కలిసిన శరద్ పవార్

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నాడు న్యూఢిల్లీలోని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఆయన నివాసంలో కలుసుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ కూడా వీరితో చేరారు. వీరి సమావేశం వెనుక కారణం ఏమిటనేది వెంటనే తెలియలేదు. అయితే, ఎన్‌సీపీ పేరు, గుర్తుకు సంబంధించిన అంశంపై ఎన్నికల కమిషన్ ముందు తన వాదన వినిపించేందుక శరద్ పవార్ ఢిల్లీలో ఉన్నారు. అజిత్ పవార్

మిగతా 2లో...



### పొలిటికల్ టూరిస్టులు
### చెప్పే మాటలు
## నమ్మొద్దు



వరంగల్- ప్రభాత సూర్యుడు

పొలిటికల్ టూరిస్టులు చెప్పే మాటలను ప్రజలు నమ్మొద్దని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం నాడు వరంగల్‌లో మంత్రి కేటీఆర్ పర్యటించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొన్నారు. వరంగల్ సభలో కేటీఆర్ సమక్షంలో బీజేపీ నేత ఈగ మల్లేశం బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...' 'కేసీఆర్ ప్రభుత్వానిది సంక్షేమం, విపక్షాలది సంక్షోభం. అరవై ఏళ్ల

మిగతా 2లో...

### నేటి నుంచి ముఖ్యమంత్రి
## అల్పాహారం

- నియోజకవర్గానికి ఓ పాఠశాలలో అమలు
- దసరా తర్వాత అన్ని స్కూళ్లకు విస్తరణ
- 27,147 బడుల్లో 23 లక్షల మందికి ప్రయోజనం
- మెనూ విడుదల చేసిన ప్రభుత్వం
- ఒక్కో రోజు ఒక్కో వంటకం




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర ప్రభుత్వం మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారాన్ని అందించాలని నిర్ణయించింది. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల జెడ్పీహెచ్‌లో ఈ పథకాన్ని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభిస్తారు. అయితే ముఖ్యమంత్రి అల్పాహార పథకానికి సంబంధించిన మెనూను ప్రభుత్వం విడుదల చేసింది. విద్యార్థులకు ఒక్కో రోజు ఒక్కో వంటకాన్ని అందించాలని నిర్ణయించింది. పిల్లలకు అన్ని రకాల పోషకాలు అందేలా వారంలో ఆరు రోజులకు ప్రత్యేక మెనూను రూపొందించింది. ప్రతి రోజూ ఉదయం పాఠశాలల ప్రారంభానికి 45 నిమిషాల ముందే విద్యార్థులకు అల్పాహారం అందించనుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో

మిగతా 2లో...

### చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై
### సినీ ఇండస్ట్రీ స్పందించకపోవడంపై
## పవన్ సంచలన వ్యాఖ్యలు



మంగళగిరి- ప్రభాత సూర్యుడు

చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారు ఎందరో రియాక్ట్ అవుతున్నారు. చంద్రబాబుకు మేమంతా ఉన్నాం అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. కానీ టాలీవుడ్ నుంచి ఇంత వరకు ఎవరు ఈ విషయంపై మాట్లాడలేదు. కనీసం మద్దతు తెలపలేదు. ఇదే విషయంపై తాజాగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో సినీ ఇండస్ట్రీని మినహాయించాలని కోరారు. అయితే సినిమా ఇండస్ట్రీ నుంచి మాత్రం నట్టి కుమార్ మినహా ఎవరూ ముందుకు వచ్చి

మిగతా 2లో...

### కాంగ్రెస్‌లో వైఎస్సార్టీపీ
## విలీనానికి బ్రేక్..!

హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్‌లో వైఎస్సార్టీపీ విలీనానికి బ్రేక్ పడింది! కాంగ్రెస్‌లో విలీనం చేయడానికి వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల కొన్ని డిమాండ్లు.. హైకమాండ్ ముందు ఉంచడం, పలుమార్లు బెంగళూరు వేదికగా ట్రబుల్ షూటర్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. ఢిల్లీ వేదికగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, వేణు గోపాల్‌తో వరుస భేటీలు అయినప్పటికీ డిమాండ్స్ విషయంలో తేడా రావడంతో విలీనానికి బ్రేక్ పడినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. వాస్తవానికి సెప్టెంబర్-30 వరకు



కాంగ్రెస్‌కు షర్మిల డెడ్‌లైన్ విధించడంతో వ్యూహకర్త సునీల్ కొనుగోలు రంగంలోకి దిగి డీల్ చేసినట్లుగా ఆ మధ్య వార్తలు వచ్చాయి. ఒకట్రెండు రోజుల్లో ఢిల్లీ వెళ్లడం ఇక మిగిలింది విలీనమేనని తేలింది కానీ.. సీన్ కట్ చేస్తే ఈ గ్యాప్‌లో ఏం జరిగిందో తెలియట్లేదు కానీ బ్రేక్ పడింది. ఈ విషయంపై అటు కాంగ్రెస్ నుంచిగానీ.. ఇటు వై ఎ స్సా ర్టీ పీ నుంచి ఎలాంటి

మిగతా 2లో...

### కేసీఆర్‌ను నిండు మనస్సుతో
## ఆశీర్వదిద్దాం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి



చేవెళ్ల- ప్రభాత సూర్యుడు: ముచ్చటగా మూడోసారి గెలిచేలా సీఎం కేసీఆర్‌ను ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని ఊరెళ్ల, మొండివాగు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ మానవీయ కోణంలో ఆలోచించి ప్రజలకు మేలు చేసే పథకాలకు శ్రీకారం చుడుతున్నారని చెప్పారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం

మిగతా 2లో...

## వామపక్ష తీవ్రవాదానికి
# రెండేళ్లలో చరమగీతం

(మొదటి పేజీ తరువాయి)
ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశం నుంచి వాపమపక్ష తీవ్రవాదాన్ని కూకటివేళ్లతో పూర్తిగా నిర్మూలించేందుకు అవసరమైన రోడ్‌మ్యాప్ రూపొందించడం, ఇంతవరకూ తీసుకున్న చర్యలపై సమీక్షించేందుకు ఈ సమావేశం ఏర్పాటయింది. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా, కేంద్ర హెూం శాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణి, అడవులు, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి అశ్విని చౌబే, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి దేవుసింగ్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ దోవల్ ఈ సమావేశానికి హాజరయ్యారు. హెూం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరక్టర్ తపనే డెకా, ఎన్ఐఏ, సహస్ర సీమ బల్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఎన్ఎస్‌జీ, ఐటీబీపీ డైరెక్టర్ జనరల్స్, నక్సల్స్ బాధిత రాష్ట్రాల హెూం సెక్రటరీలు, చీఫ్ సెక్రటరీలు సైతం పాల్గొన్నారు. 2021 సెప్టెంబర్‌లో చివరిసారిగా ఎల్‌డబ్ల్యూఈ సమావేశం జరిగింది.

**నిర్ణయాత్మక దశకు చేరిన పోరాటం..**

కాగా, వామపక్ష తీవ్రవాదంపై 2022, 2023లో గణనీయమైన విజయాలు సాధించామని, రాబోయే రెండేళ్లలో పూర్తిగా వామపక్ష తీవ్రవాదం బెడదను నిర్మూలించేందుకు ఈ ఏడాది గట్టిగా తీర్మానించుకోవాలని అమిత్‌షా శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో దిశానిర్దేశం చేశారు. వామపక్ష తీవ్రవాదంపై పోరు నిర్ణయాత్మక దశకు చేరిందన్నారు. నక్సల్స్ తమ స్థావరాలను కొత్త ప్రాంతాలకు విస్తరించకుండా ఏజెన్సీలు గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. 2019 నుంచి నక్సల్స్ బాధిత ప్రాంతాల్లో భద్రతా బలగాలతో 195 కొత్త క్యాంపులు ఏర్పాటు చేశామని, మరో 44 కొత్త క్యాంపులు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. వామపక్ష తీవ్రవాదం నుంచి ఆయా ప్రాంతాలను విముక్తి చేసేందుకు నిరంతర నిఘాఉంచాలని, తిరిగి సమస్య తలెత్తకుండా చూడాలని అన్నారు. ఎక్కడ సమస్య ఉందో అక్కడే నిర్మూలనా చర్యలు తీసుకోవడం వల్ల ఇతర రాష్ట్రాలలో తీవ్రవాదులు ఆశ్రయం పొందే అవకాశం ఉండదన్నారు. 2014 నుంచి వామపక్ష తీవ్రవాదంపై ప్రభుత్వం ఉక్కుపిడికిలి బిగించిదని, ప్రభుత్వ చర్యలతో గత నాలుగు దశాబ్దాలుగా ఎన్నడూ లేనంతగా 2022లో హింసాత్మక ఘటనలు, మృతుల సంఖ్య బాగా తగ్గిందన్నారు.

ఎన్ఐఏ, ఈడీ, రాష్ట్ర ఏజెన్సీలు మరింత సమన్వయంతో పనిచేసి వామపక్ష తీవ్రవాదం ఆర్థిక మూలాలను దెబ్బతీయాలన్నారు. నక్సల్స్ బాధిత ప్రాంతాల్లో అభివృద్ధి ప్రాజెక్టులపై మాట్లాడుతూ, రోడ్ల నిర్మాణం, టెలికమ్యూనికేషన్, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్, స్కిల్ డవలప్‌మెంట్, ఎడ్యుకేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఎల్‌డబ్ల్యూఈ బాధిత జిల్లాల్లో స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ స్కీమ్ కింద 14 వేలకు పైగా ప్రాజెక్టులను కేంద్రం ప్రారంభించిందని తెలిపారు. వీటిలో 80 శాతానికి పైగా ప్రాజెక్టులు పూర్తయ్యాయని, ఈ స్కీమ్ కింద కేంద్రం రూ.3,296 కోట్లు విడుదల చేసిందని అమిత్‌షా చెప్పారు.

## ఖర్గే, రాహుల్‌ను
# కలిసిన శరద్ పవార్

(మొదటి పేజీ తరువాయి)
వర్గం సైతం పార్టీ పేరు, గుర్తును క్లెయిమ్ చేస్తుండటంతో ఆయన వర్గం సైతం ఎన్నికల కమిషన్ ముందు విచారణకు హాజరుకానుంది. ఇటు శరద్ పవార్, అటు అజిత్ పవార్ తమ వాదనలకు బలం చేకూర్చే డాక్యుమెంట్లను ఈసీఐకి సమర్పించాల్సి ఉంది. ఈ కేసు ఈసీఐ ముందు తొలిసారి విచారణకు వస్తోంది. దీనికి ముందు, ఇరువర్గాలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణకు హాజరుకావాలని ఈసీఐ వీరికి నోటీసులు పంపింది. ఇటీవల ఎన్‌సీపీలో తిరుగుబాటు బావుటా ఎగురవేసిన అజిత్ పవార్ తన వర్గానికి చెందిన 8 మంది ఎమ్మెల్యేలతో శివసేన-బీజేపీ సారథ్యంలోని మహారాష్ట్ర ప్రభుత్వంలో చేరారు. ఉపముఖ్యమంత్రిగా అజిత్ పవార్, క్యాబినెట్ మంత్రులుగా ఆయన వర్గం ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. తమ వెంట 42 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, తమదే అసలైన ఎన్‌సీపీ అని అజిత్ వర్గం వాదనగా ఉంది. అయితే, ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు ఎవరనేది మహారాష్ట్ర ప్రజలకే కాకుండా యవాద్దేశానికి తెలుసనని, పార్టీని వీడిన వారికి పార్టీతో సంబంధం లేదని శరద్ పవార్ తెగేసి చెబుతున్నారు.

## పొలిటికల్ టూరిస్టులు చెప్పే
# మాటలు నమ్మొద్దు

(మొదటి పేజీ తరువాయి)
అధికారంలో ఉండి అభివృద్ధి చేయని కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇప్పుడు తెలంగాణకు అభివృద్ధి చేస్తామంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. ఒక్కఛాన్స్ ఇవ్వాలని మీదగ్గరకు వస్తారు, నమ్మి మోసపోకండి. మోసాన్ని మోసంతోనే జయించాలి. మళ్లీ అధికారంలోకి వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే. త్వరలోనే కేసీఆర్ నోట శుభవార్త వింటారు. మేము ఎవరికీ బీ టీమ్ కాదు. మాది తెలంగాణలో ఏటీమ్" అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

**త్వరలోనే కేసీఆర్ పింఛన్లు పెంచే ప్రకటన చేస్తారు**

**వరంగల్:** సీఎం కేసీఆర్ త్వరలోనే పింఛన్లు పెంచే ప్రకటన చేస్తారని మంత్రి కేటీఆర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి మైదానంలో బీఆర్ఎస్ బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. "ఎన్నికలు వస్తున్నాయని.. సంక్రాంతికి గంగిరెద్దులోళ్లు వచ్చినట్టు విపక్షాలు వస్తాయి. హైదరాబాద్ సంస్థానాన్ని ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్. తెలంగాణపై ప్రధాని నరేంద్రమోదీ విషం చిమ్ముతున్నారు. తెలంగాణ ఇస్తే ఇక్కడ సంబరాలు జరగలేదని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ నేతలకు బంపర్ ఆఫర్ ఇస్తున్నా. మేము బస్సులు ఏర్పాటు చేస్తాం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించండి. కరెంటు తీగలు పట్టుకోండి. కరెంటు ఉందోలేదో తెలుస్తాది. దరిద్రం పోతాది. తెలంగాణ ఉద్యమం జరుగుతన్నప్పుడు అమెరికా పారిపోయిన కిషన్ రెడ్డి ఇవాళ బీజేపీ అధ్యక్షుడు అయ్యారు. మోదీ దేవుడని బండి సంజయ్ అంటున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచినందుకు దేవుడా...?, తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదింది వరంగల్. వరంగల్ వాళ్లు ఆగట్టునుంటారా..?, ఆగట్టునుంటారా...? తేల్చుకోవాలి. వినయ్ భాస్కర్‌కు మరోసారి ఓటేసి గెలిపించండి." అని కేటీఆర్ ప్రజలను కోరారు.

# నేటి నుంచి ముఖ్యమంత్రి అల్పాహారం

(మొదటి పేజీ తరువాయి)
చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అల్పాహారాన్ని అందించేందుకు ఉద్దేశించిన 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం'ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజక వర్గంలో ఒక పాఠశాలలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన పాఠశాలల్లో దసరా సెలవులు పూర్తి కాగానే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె వివరించారు. ఇందుకు సంబంధించి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకం అమలు తీరును పర్యవేక్షించే బాధ్యతను పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లకు, గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగిస్తున్నామని తెలిపారు. విద్యాశాఖ, పంచా యతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తాయని వివరించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు డ్రాపౌట్లను తగ్గించి, హాజరు శాతాన్ని పెంచడంతో పాటు వారికి చదువు పట్ల శ్రద్ధ కలిగేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని భావిస్తున్నామని తెలిపారు. దీన్ని అమలు చేయడం ద్వారా 27,147 పాఠశాలల్లోని దాదాపు 23 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.672 కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యంతో కూడిన భోజనం, వారానికి మూడు గుడ్లను అందిస్తున్నామని వివరించారు.

సన్న బియ్యం కోసం రూ.187 కోట్లు, గుడ్ల కోసం రూ.120 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా భరిస్తున్నదని తెలిపారు. దేశంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు మాత్రమే అమలు చేస్తుండగా తెలంగాణలో మాత్రం తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు కూడా అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం అదనంగా రూ.137 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఐరన్, సూక్ష్మ పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రూ.32 కోట్లు వెచ్చించి రాగి జావను ఇస్తున్నామని తెలిపారు. అల్పాహార నాణ్యతను పరిశీలించేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీ చేస్తారని పేర్కొన్నారు.

## కేసీఆర్‌ను నిండు మనస్సుతో
# ఆశీర్వదిద్దాం

(మొదటి పేజీ తరువాయి)
అందించాలన్న లక్ష్యంతో సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేసినట్లు చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యను హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అంతకు ముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. చేవెళ్ల పట్టణ కేంద్రం నుంచి ఊరెళ్ల చివరి వరకు డబుల్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ విజయలక్ష్మీ రమణారెడ్డి, జడ్పీటీసీ మాలతీ కృష్ణారెడ్డి, వైఎస్ ఎంపీపీ శివప్రసాద్, ఎంపీడీవో హిమాబిందు, పీఆర్డీఈ దయానంద్‌రెడ్డి, ఆర్ఐ రాజేశ్, ఎంఈవో అక్బర్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నర్సింలు, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, జహంగీర్, వెంకటేశంగుప్తా, నరహరిరెడ్డి, భీమయ్య, సీనియర్ నాయకులు కుంచం శివకుమార్, రమణారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ యాదయ్య, మాజీ సర్పంచ్ అరుణనర్సింలు, ఉప సర్పంచ్ విఠలయ్య, డైరెక్టర్ కృష్ణ, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు చందు, వీరేశ్, ఆంజనేయులు, యాదయ్య, మంగలి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామ స్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో వైఎస్సార్టీపీ విలీనానికి బ్రేక్..!

(మొదటి పేజీ తరువాయి)
ప్రకటనలు కానీ, కనీసం సోషల్ మీడియా వేదికగా కూడా రియాక్షన్స్ లేవు. గత మూడ్రోజులుగా షర్మిల హస్తినలోనే మకాం వేసినప్పటికీ కాంగ్రెస్ అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆమె ఈ నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది.


**షర్మిల ఏం చేయబోతున్నారు..?**

విలీనానికి బ్రేక్ పడటంతో ఇక వచ్చే ఎన్నికల్లో సొంతగానే బరిలోకి దిగాలని షర్మిల భావిస్తున్నట్లు తెలియవచ్చింది. అంటే.. విలీనమే కాదు ఎలాంటి పొత్తులు కూడా లేకుండా వైఎస్సార్టీపీ బరిలోకి దిగబోతోందన్న మాట. అంతేకాదు.. అక్టోబర్-09 నుంచి పార్టీ బీ-ఫామ్‌ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కూడా అతి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతున్నట్లు సమాచారం. ఇప్పటికీ ఇందుకు సంబంధించి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దాదాపు అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీచేయడానికి షర్మిల సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మరోవైపు.. ఇక కాంగ్రెస్ మాటే ఎత్తకూడదని ఇంత జరిగిన తర్వాత విలీనం అనే ఊసే రాకూడదని షర్మిల భావిస్తున్నట్లు తెలియవచ్చింది.

**షర్మిల పోటీ ఇక్కడ్నుంచే..?**

ముందుగా అనుకున్నట్లుగానే వైఎస్ షర్మిల రెడ్డి.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కీలక నియోజకవర్గం అయిన పాలేరు అసెంబ్లీ నుంచి బరిలోకి దిగబోతున్నారు. ఇప్పటికే పార్టీ ఆఫీసు, వైఎస్సార్ విగ్రహాన్ని కూడా షర్మిల ప్రారంభించి.. పార్టీ కార్యక్రమాలను షురూ చేశారు. ఒకవేళ విలీనం అయ్యి ఉంటే.. కాంగ్రెస్ తరఫున కీలక నేత, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బరిలోకి దింపాలన్నది హైకమాండ్ భావన. అయితే షర్మిలను సికింద్రాబాద్ అసెంబ్లీ నుంచి పోటీచేయించాలని హైకమాండ్ ప్లాన్ చేసిందట. ఇప్పుడు విలీనం లేదు కాబట్టి యథావిధిగా షర్మిల పాలేరు నుంచే బరిలోకి దిగబోతున్నారట. అంతేకాదు.. 119 నియోజకవర్గాల నుంచి పార్టీ తరఫున అభ్యర్థులను బరిలోకి దింపడానికి సన్నాహాలు చేసుకుంటున్నారట. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఒకట్రెండు రోజుల్లో పోటీ గురించి షర్మిల కీలక ప్రెస్‌మీట్ నిర్వహించి అధికారికంగా ప్రకటన చేయబోతున్నారట. మరి ఈ మీడియా సమావేశంతో అయినా విలీనానికి ఎందుకు బ్రేక్ పడింది..? అనే విషయంపై క్లారిటీ వస్తుందేమో చూడాలి.

## ఉచిత హామీలు..
# 2 రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు



**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు:** పన్నుదారుల డబ్బుతో ఓటర్లకు ఉచితాలను ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటీషన్‌పై ఇవాళ సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వంతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు ఇచ్చింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలా, జస్టిస్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఆ పిల్‌ను విచారించింది. ఎన్నికల సంఘం, రిజర్వ్ బ్యాంక్‌కు కూడా కోర్టు నోటీసులు జారీ చేసింది. రెండు రాష్ట్రాలు తమ ఓటర్లను ఆకర్షించేందుకు ఉచిత ప్రకటనలు చేస్తున్నాయని పిల్‌లో ఆరోపించారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వాలు ఓటర్లకు డబ్బును పంపిణీ చేయడం దారుణమని, ఎన్నికల వేళ ప్రతిసారి ఇదే జరుగుతోందని, పన్నుదారులపై ఆ భారం పడుతుందని పిల్ తరఫున న్యాయవాది వాదించారు. ఉచిత హామీలను వ్యతిరేకిస్తూ భట్టూలాల్ జైన్ సుప్రీంలో పిల్ దాఖలు చేశారు.

## చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై
### సినీ ఇండస్ట్రీ స్పందించకపోవడంపై
# పవన్ సంచలన వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)
మాట్లాడలేదు. నిర్మాత సురేష్ బాబు అయితే.. ఇది సినిమా ఇండస్ట్రీకి సంబంధించిన సమస్య కాదని.. అన్ని పార్టీలు, అందులోని వ్యక్తులు సినిమా ఇండస్ట్రీకి కావాల్సిన వారేనని.. అందుకే సున్నితమైన ఈ సమస్యపై ఎవరూ మాట్లాడటం లేదంటూ ఓ పబ్లిక్ ఫంక్షన్‌లో చెప్పుకొచ్చారు. నిజంగానే తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి ఇప్పటి వరకు చంద్రబాబుకి ఎవరూ మద్దతు తెలపలేదు. ఇదే విషయంపై తాజాగా జనసేన అధినేత, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "సినిమా ఇండస్ట్రీ మీద చాలా ఒత్తిడి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో స్పందించడానికి కూడా సినిమా వాళ్లు భయపడతారు. గతంలో మేము ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు, ఎన్టీఆర్ గారు తెలుగు దేశం పార్టీ పెట్టినప్పుడు.. పాలిటిక్స్‌కు సంబంధించి సినిమా ఇండస్ట్రీలో డిఫరెంట్ గ్రూప్స్ ఉన్నాయి. కృష్ణగారు, ప్రభాకర్ రెడ్డిగారు.. అలాంటి వారంతా కాంగ్రెస్ పార్టీకి సపోర్ట్‌గా ఉన్నారు. ప్రతి పార్టీకి సినిమా ఇండస్ట్రీ నుంచి బేసిక్ సపోర్ట్ ఉంటుంది. ఇప్పుడు వైసీపీకి కూడా ఉంది. నాకు సపోర్ట్ ఉందని కూడా నేను గట్టిగా చెప్పలేను. అసలు ఈ విషయంపై నేనెప్పుడు దృష్టి కూడా పెట్టలేదు. సినిమా పరిశ్రమ అనేది వండర్‌ఫుల్ ఇండస్ట్రీ. అది పొలిటికల్ పార్టీ కాదు. ఇందులో కళాకారులతో పాటు 24 శాఖలలో పని చేసే వ్యక్తులు ఉంటారు. అందుకే వారు పొలిటికల్ హీట్‌ని వారు డైరెక్ట్‌గా తీసుకోలేరు. వాళ్లకి వంద సమస్యలు ఉంటాయి. వాళ్ల బాధని నేను అర్థం చేసుకోగలను. అలా అని వారు బాధపడటం లేదా.. ఎలాంటి అభిప్రాయం లేదా అని అనలేం. ఒకవేళ ఎవరైనా వచ్చి మాట్లాడితే.. వాళ్లని వైసీపీ వాళ్లు టార్గెట్ చేసేస్తారు. ఎన్టీఆర్‌గారు సీఎంగా ఉన్నప్పుడు.. ఆయన మీద తీయని సినిమా లేదు. 'మండలాధీశుడు' నుంచి తీస్తూనే ఉన్నారు. కోటగారు, పృథ్వీగారు.. ఎన్టీఆర్‌గారి క్యారెక్టర్లో నటించారు. ఇన్ని తీసినా ప్రభుత్వం తరపు నుంచి కక్ష సాధింపు చర్యలు వంటివి ఎప్పుడూ జరగలేదు. ఆ తర్వాత కలిసి కూడా యాక్ట్ చేశారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఏం మాట్లాడాలన్న భయంతో ఉన్నారు. ఎక్కడికో ఎందుకు.. ఒక సీనియర్ యాక్టర్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, అశేష ప్రజాభిమానం కలిగిన వ్యక్తి సూపర్ స్టార్ రజనీకాంత్ గారు.. చంద్రబాబుగారి గురించి మంచి చెప్పారని ఎలా తిట్టారో చూశారు కదా! ఆయనని తిట్టని తిట్టు లేదు. అలాంటి ఆయననే అలా చేస్తే.. ఇక్కడున్న సినిమా ఇండస్ట్రీకి చెందిన వారు అటువంటి వాళ్ల నోటిలో పడాలని ఎవరు కోరుకుంటారు. నాలాంటి మొండివాడు ఏమైనా బయటికి రావాలి.. ఎందుకంటే నేను ప్రస్తుతం రాజకీయాలలో ఉన్నాను కాబట్టి నాకు ఆ కెపాసిటి ఉంది.. కానీ, నేను కూడా కేవలం సినిమాలలో ఉండి ఉంటే.. ఎంత వరకు మాట్లాడగలిగేవాడినో నాకూ తెలియదు. అందుకని.. ఫిల్మ్ ఇండస్ట్రీకి విషయంలో మినహాయింపు ఇవ్వాలని కోరుకుంటున్నాను.." అని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

# 16న బీఆర్ఎస్ మేనిఫేస్టో ప్రకటన..!

(మొదటి పేజీ తరువాయి)
టని కాంగ్రెస్ నేతలు సెటైర్లు వేస్తుంటే... ఈనెల 16న మేనిఫేస్టో ప్రకటనకు ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్ధమవుతున్నారు. ఇక కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల్లో మంచి స్పందన రావడంతో ఆ పార్టీ నేతలు ఫుల్ జోష్‌లో ఉన్నారు.

# సంపాదకీయం

## కులాల తుట్టెను కదిపిన నితీష్

బీహార్ రాష్ట్ర కులగణన వివరాలను విడుదల చేస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కుల రాజకీయాలకు బూస్టర్ డోస్ ఇచ్చారు. కుల గణనను ప్రకటించిన మొదటి రాష్ట్రంగా బీహార్ అవతరించింది. బీహార్‌లో ఒక్కో కులానికి ఉన్న సంఖ్యా బలం ఇప్పుడు తెలిసిపోయింది. వారి రాజకీయ, సామాజిక, ఆర్థిక స్థితిగతులు సైతం తెలిశాయి. అందుబాటులోకి వచ్చిన గణాంకాల ఆధారంగా కులాల సంఖ్యాబలంపై తులనాత్మక విశ్లేషణ చేయవచ్చు. తద్వారా రాజకీయాల్లో వారిని పావులుగా మార్చుకోవచ్చు. తద్వారా కుల గణన అధికార బీజేపీ హిందుత్వ రాజకీయాలను దెబ్బతీసే అవకాశం ఉంది. అంతిమంగా ప్రస్తుత భారత రాజకీయాల మొత్తం సరళిని మార్చగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.కులాలవారిగా హిందూ సమాజాన్ని విభజించగల్గితే చాలు.. భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని దెబ్బకొట్టొచ్చని భావిస్తున్నాయి. తాజాగా బిహార్ రాష్ట్రంలో విడుదల చేసిన కులాలవారీ జనాభా గణాంకాలే ఈ క్రమంలో తొలి అడుగుగా చెప్పుకోవచ్చు. నితీశ్ ప్రయోగించిన ఈ అస్త్రాన్ని కాంగ్రెస్ సహా ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీలు కలసికట్టుగా ప్రయోగిస్తే బ్రహ్మాస్త్రంగా మారి బీజేపీని దెబ్బతీసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే విపక్ష కూటమి దాన్ని బ్రహ్మాస్త్రంగా మార్చుతుందా లేక చతికిలపడుతుందా అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న.బీజేపీని ఓడించడమే లక్ష్యంగా విపక్షాలన్నింటినీ సమావేశపరిచి అజెండా తయారుచేయడంలో సఫలమైన బిహార్ సీఎం నితీశ్ కుమార్, కుల గణన చేపట్టి మరోసారి మిగతా పార్టీలకు దిశానిర్దేశం చేశారు. గత నెలలో విపక్ష కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో జాతీయ స్థాయిలో కుల గణన చేపట్టాలన్న డిమాండ్‌కు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఆ తర్వాత జరిగిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ డిమాండ్ చేస్తూ ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా చదివిన 'ఠాకూర్ కా కువాన్' కవిత అగ్రవర్ణ రాజ్‌పుత్‌లలో ఆగ్రహానికి దారితీసింది. ఇప్పుడు బీహార్‌లో కుల గణన ప్రకటనతో ఓబీసీ రాజకీయాలు ఊపందుకున్నాయి. ఆ ఊపును కొనసాగించాల్సిన బాధ్యత కాంగ్రెస్, దాని మిత్రపక్షాలపై ఉంది. అయితే రాహుల్ గాంధీ ట్రాక్ రికార్డ్ గమనిస్తే.. రాజకీయంగా ఉపయోగపడే అనేకాంశాలను ఆయన విడిచిపెట్టిన సందర్భాలున్నాయి. ఈసారి కూడా అలా చేసే అవకాశం లేకపోలేదని కొందరు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ మధ్య కులగణన కోసం గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే కులగణన చేపడతామంటూ ప్రకటిస్తున్నారు. 'జిస్కీ జిత్నీ అబాదీ ఉస్కా ఉత్నీ హిస్సేదారి' అంటూ జనాభా దామాషా ప్రకారం అన్నివర్గాలకు రాజకీయాల్లో, రాజ్యాధికారంలో వాటా దక్కాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది ప్రజల్లోకి వెళ్తే కచ్చితంగా గేమ్ ఛేంజర్‌గా మారే అవకాశం ఉంది.అధికారంలో ఉన్నప్పుడు కుల గణన నిర్వహించడంలో విఫలమైనందుకు ఇటీవల రాహుల్ గాంధీ చేసినట్లుగా కాంగ్రెస్ క్షమాపణలు చెప్పడం వల్ల వచ్చే నష్టం ఏమీ లేదు. ఈ విషయంలో కాంగ్రెస్ నిజాయితీగా పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేయాలి. 2019లో ఆ పార్టీ దాదాపు 186 పార్లమెంటరీ స్థానాల్లో బీజేపీతో ప్రత్యక్షంగా తలపడింది. వాటిలో కేవలం 15 మాత్రమే గెలుచుకోగలిగింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ మరోసారి విఫలమైతే విపక్ష కూటమి సాధించేదేమీ ఉండదు.మరోవైపు విపక్ష కూటమి ముఖ్యమంత్రులు కూడా నితీశ్ కుమార్ మార్గాన్ని అనుసరించాలి. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ, ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ వంటి ముఖ్యమంత్రులు కుల జనాభా గణన విషయంలో ఇతర మిత్రులతో ఏకీభవించడం లేదు. కానీ ప్రకటించడం వల్ల వచ్చే నష్టం లేదు అన్నది మిగతా భాగస్వామ్యపక్షాల సూచన. ఈ పార్టీలు ఇప్పటికే జాతీయస్థాయిలో కుల గణనకు అంగీకరించినప్పుడు.. రాష్ట్ర స్థాయిలో ప్రకటిస్తే వచ్చే నష్టం ఏమీ లేదు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఒక అడుగు ముందుకేస్తే విపక్ష కూటమి మొత్తంగా ఓబీసీలను ఆకట్టుకోవడంలో దోహదపడుతుంది.మహిళా రిజర్వేషన్ల బిల్లును పాస్ చేసి తద్వారా మహిళా ఓట్లకు గాలం వేయాలని చూస్తున్న బీజేపీ.. ఆ బిల్లును తక్షణం అమల్లోకి తీసుకురాకపోవడం వల్ల కొంత విమర్శల్ని ఎదుర్కోక తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో విపక్ష కూటమి ఓబీసీ మహిళలకు టికెట్ల పంపిణీలో ప్రాధాన్యతనిస్తే? బీజేపీ మహిళా బిల్లు అస్త్రానికి చెక్ పెట్టొచ్చు. ఇప్పటికే ఉన్న ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు సీట్లతో పాటు ఓబీసీ మహిళలకు కనీసం 20 శాతం వాటా దక్కేలా చూడగలిగితే సరిపోతుంది. కూటమిలో పార్టీల స్వభావం, సిద్ధాంతం ఒకటి కానప్పటికీ.. 120 స్థానాలు కల్గిన ఉత్తర్ ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లోని సమాజ్‌వాదీ, జనతాదళ్(యునైటెడ్), రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ)లు మహిళలకు సీట్ల కేటాయింపులో ప్రాధాన్యతనిస్తే బీజేపీని ఇరకాటంలో పడేయవచ్చు విపక్ష కూటమి ఓబీసీల వెంట ఉందని చెప్పడం కోసం పాట్నాలోని ప్రసిద్ధ గాంధీ మైదాన్ లేదా లక్నోలోని హజ్రత్ మహల్ పార్క్‌లో 'ఓబీసీ' సభలు నిర్వహించాలి. దేశంలో ఎన్నడూ జరగనటువంటి అతిపెద్ద ర్యాలీగా చెప్పుకోవాలి. ఇంత పెద్ద దేశంలో ఓట్ల శాతానికి గండి కొట్టాలంటే ఇలాంటి భారీ ప్రయత్నాలు కూడా అవసరమవుతాయి. సోషల్ మీడియాలో ఎంత చేసినా సరే.. ఎన్నికల్లో గెలుపొందాలంటే క్షేత్రస్థాయిలో ఉన్న వ్యక్తులకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. గతంలో లక్నో, పాట్నా, ఢిల్లీలో జరిగిన బహిరంగ సభలు దేశంలో అనేక ఉద్యమాలకు నాంది పలికాయి. ఇలాంటి ఉద్యమాల్లో ఓబీసీలను నిమగ్నం చేయడం ద్వారా విపక్ష కూటమి ప్రయోజనం పొందగల్గుతుంది.కులగణన చేపట్టినంత మాత్రాన ఆయా కులాల్లో అకస్మాత్తుగా వచ్చే మార్పేమీ ఉండదు. కాకపోతే ఆయా కులాల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులను మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రణాళికలు, పథకాలు రూపొందించేందుకు ఈ డేటా ఉపయోగపడుతుంది. అదే ఇప్పుడు రాజకీయాల్లో ముడి సరుకుగా మారుతుంది. సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న కులాలేంటో తెలుస్తుంది. సంఖ్యాబలం ఉన్నప్పటికీ అణగారిన కులాలు, రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం లేని కులాలు తమకు సముచిత వాటా కోసం, సంక్షేమం కోసం నినదించే అవకాశం ఉంటుంది. ఈ పరిణామాల నేపథ్యంలో తాము దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి, ఆ ప్రాతిపదికన ఓబీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ లేదా విపక్ష కూటమి ప్రకటిస్తే.. బీజేపీ ఇరకాటంలో పడుతుంది. ఆ హామీని తిరస్కరించడం సాధ్యం కాదు. నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వార్డ్ క్లాసెస్ (ఎన్సీబీసీ)కి చట్టబద్ధత, కులవృత్తులపై ఆధారపడ్డ బీసీ వర్గాల కోసం ముద్ర రుణాలు, పీఎం-విశ్వకర్మ వంటి పథకాలు, కేంద్ర మంత్రివర్గంలో అత్యధిక సంఖ్యలో ఓబీసీ మంత్రులు వంటి చర్యలెన్ని చేపట్టినా సరే.. కులగణనపై జాగ్రత్తగా వ్యవహరించకపోతే మోదీ సర్కారుకు వరుసగా రెండు పర్యాయాలు భారీ విజయాన్ని అందించిన ఓబీసీ ఓటుబ్యాంకులో చీలిక వచ్చే ప్రమాదం ఉంది.

# ఇంటి నుంచే వయో వృద్ధులు, వికలాంగులకు ఓటు అవకాశం

■ మద్యం, డబ్బు కట్టడికి హైటెక్నాలజీతో నిఘా ■ నిబంధనల మేరకే 22 లక్షల ఓట్ల తొలగింపు : సీఈసీ రాజీవ్ కుమార్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

గడువులోగా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ఎన్నికల సన్నాహాలను పరిశీలించేందుకు రాష్ట్రానికి వచ్చిన సీఈసీ బృందం రెండు రోజులుగా చేసిన కసరత్తును రాజీవ్ కుమార్ గురువారం హైదరాబాద్‌లో మీడియాకు వెల్లడించారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేస్తున్నదని చెప్పారు. మూడు రోజులుగా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, ఎన్‌ఫోర్స్ మెంట్ ఏజెన్సీలు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, సీఎస్, డీజీపీలతో సమావేశమై అన్ని అంశాలను చర్చించినట్టు తెలిపారు. నగదు, మద్యం పంపిణీని కట్టడి చేయాలనీ, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు పెంచాలనీ, ఓటరు స్లిప్పుల పంపిణీ, బోగస్ ఓట్ల తొలగింపు, ఓటర్ కార్డుకు ఆధార్ లింకు చేయాలని రాజకీయ పార్టీలు తమ దృష్టికి తీసుకువచ్చాయని సీఈసీ చెప్పారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. ప్రతి వారం విధిగా నివేదికను ఈసీకి అందజేయాలని ఏజెన్సీలను ఆదేశించామనీ, నగదు జమ, ఉపసంహరణలపై ఆర్బీఐ, ఎస్ఎల్బీసీ, ఇతర సంస్థల నిఘా ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో 22 లక్షలకు పైగా ఓట్లను తొలగించామని పేర్కొన్నారు. కొత్తగా 8.11 లక్షల మంది యువ ఓటర్లు ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని చెప్పారు. తెలంగాణలో స్త్రీ, పురుష ఓటర్ల సంఖ్య ఇంచుమించు సమానంగా ఉండటం సంతోషించదగ్గ విషయమని ఆయన అన్నారు. మద్యం, డబ్బు కట్టడికి హైటెక్నాలజీని వినియోగించనున్నట్టు తెలిపారు. ఈసారి తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో వృద్ధులు, వికలాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యం కల్పిస్తున్నామని సీఈసీ వెల్లడించారు. రాష్ట్రంలో 80 ఏండ్లకు పైబడిన 4.43 లక్షల మంది సీనియర్ సిటీజన్లకు, 5 లక్షల మంది వికలాంగ ఓటర్లకు దీని వల్ల ప్రయోజనం చేకూరుతుందన్నారు. అయితే నోటిఫికేషన్ వచ్చిన ఐదు రోజుల్లో ఫాం 12డి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 35,356 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామనీ, 27,798 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సీ విజిల్ మొబైల్ యాప్‌ను వినియోగించాలనీ, ఎన్నికల అక్రమాలను యాప్‌లో పొందుపరిస్తే గంటన్నరలోగా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ఓటర్లు తమ వివరాలను ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశముందన్నారు. ఆన్‌లైన్‌లో నామినేషన్ల దాఖలుకు సువిధ పోర్టల్ అందుబాటులో ఉందని చెప్పారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన గిరిజన తెగలైన చెంచు, కోలం, తోటి, కొండారెడ్డి జాతుల్లో అర్హులైన అందరికీ ఓటు హక్కు ఉందనీ, ఈ ఎన్నికల్లో 39,186 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వివరించారు. రాష్ట్ర సరిహద్దుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశామనీ, పోలీస్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, ఫారెస్ట్ శాఖలకు సంబంధించి 146 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్టు వివరించారు. పట్టణాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఈసీ రాజీవ్ కుమార్ తెలిపారు. ప్రజాస్వామ్య ఓట్ల పండుగలో భాగస్వామ్యమయ్యేందుకు ఓటర్లందరూ ఉత్సాహం చూపాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో కేంద్ర ఎన్నికల కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మరింత అనారోగ్యానికి గురైన కేసీఆర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : గత మూడు వారాలుగా వైరల్ ఫీవర్‌తో బాధపడుతన్న బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ మరింత అనారోగ్యానికి గురయ్యారు.! గులాబీ బాస్‌కు ఛాతిలో సెకండరీ ఇన్‌ఫెక్షన్ వచ్చిందని స్వయంగా మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ఇవాళ కంటోన్మెంట్ నియోజకవర్గంలో పర్యటించిన కేటీఆర్ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. కొద్ది రోజుల క్రితం వైరల్ ఫీవర్, ఇప్పుడు బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ రావడం వల్ల కోలుకోవడానికి అనుకున్న సమయం కంటే ఎక్కువ కాలం పట్టే అవకాశం ఉందని చెప్పారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు కాసింత ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిస్థితి. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని వీరాభిమానులు, కార్యకర్తలు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోనూ

## ఐటీ కంపెనీలు రావాలి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: వరంగల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఐటీ కంపెనీలు రావాలని తెలంగాణ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం వరంగల్ సమీపంలోని మడికొండ ఐటీ పార్క్‌లో రూ.40 కోట్లతో ఏర్పాటు చేసిన క్వాడ్రాంట్ సాఫ్ట్ వేర్ కంపెనీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పదేళ్లలో హైదరాబాద్‌కు, వరంగల్‌కు పెద్దగా తేడా ఉండ దన్నారు. ఐటీ రంగంలో భవిష్యత్తు అంతా టైర్ 2 నగరాలదే అన్నారు. వరంగల్ మాత్రమే కాకుండా ఏపీలోని భీమవరం, నెల్లూరుకూ ఐటీ సంస్థలు రావాలన్నారు. అక్కడ కూడా ఎన్నారైలు ఐటీ సంస్థలు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. కావాలంటే జగనన్నకు చెప్పి మీకు జాగా ఇప్పిస్తానని చెప్పారు. బెంగళూరు ఐటీ రంగంలో నలభై శాతం మన తెలుగువాళ్లే ఉన్నారన్నారు. అక్కడి నుంచి వచ్చేందుకు తెలుగు విద్యార్థులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఉన్నచోటనే యువతకు ఉపాధి దక్కాలన్నారు. క్వాడ్రాంట్ కంపెనీ నెల్లూరులోనూ పెట్టాలని, అవసరమైతే జగనన్నతో మాట్లాడుతానన్నారు. టాలెంట్ ఎవరబ్బ సొత్తు కాదని, టాలెంట్ ఉంటే ఎక్కడైనా కంపెనీలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించవచ్చునని చెప్పారు. అధిక జనాభా నష్టం అని చెప్పారు కానీ అది అబద్ధమన్నారు. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరంగల్‌కు ఇంకా చాలా కంపెనీలు రావాల్సి ఉందన్నారు. రాబోయే రోజుల్లో వరంగల్‌కు వేగవంతమైన రైలు వస్తుందని, దీంతో కంపెనీలు ఎక్కువగా వస్తాయన్నారు.

# మీడియా స్వేచ్ఛను హరిస్తే ఖబడ్దార్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :పాలకులు మీడియా స్వేచ్ఛను హరిస్తే ఖబడ్దార్ ఊరుకోబోమని పలువురు వక్తలు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వమైనా మీడియా స్వేచ్ఛను హరిండం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో మీడియా సంస్థలపై, జర్నలిస్టులపై జరిగిన దాడులను ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ దాడులను నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్ లో జర్నలిస్టులు ప్రదర్శన నిర్వహించారు. మీడియా స్వేచ్ఛను హరిస్తే ఖబర్దార్, ఢిల్లీ పోలీసుల వైఖరిని ఖండించండి, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుదాం, రాజ్యాంగ హక్కులను గౌరవిద్దాం అంటూ జర్నలిస్టులు నినదించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్ యూజే), తెలంగాణ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీబీజేఏ)ల నేతృత్వంలో బాగ్ లింగం పల్లి సుందరయ్య పార్కు పరిసర ప్రాంతాల్లో జర్నలిస్టులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి, మాజీ ఎడిటర్ ఎస్. వినయ్ కుమార్, ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, అఖిలభారత న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పార్థసారథి తదితరులతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని ముక్తకంఠంతో ఖండించారు. కేంద్ర ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తూ మీడియా మీద, పౌర సంస్థల మీద ఉక్కుపాదం మోపడం సహించారనిదని అన్నారు. న్యూస్ క్లిక్ పోర్టల్ కార్యాలయంపైన, అందులో పని చేస్తున్న 47 మంది జర్నలిస్టులపైన ఢిల్లీ పోలీసులు దాడులు జరిపిన తీరు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తుందని అన్నారు. ఎందుకు సోదాలు జరుపుతున్నారో, ఎందుకు అరెస్టులు చేస్తున్నారో చెప్పకుండా చీకటి రోజులను గుర్తు చేసే విధంగా ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వ్యవహరించారని, కేంద్ర ప్రభుత్వం తనకు వ్యతిరేకంగా వార్తా కథనాలు ఇస్తున్నారనే కక్షతో మీడియా సంస్థలను బెదిరించి తన గుప్పిట్లో పెట్టుకునేందుకు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నదని వారు ఆరోపించారు. కఠినమైన ఉపా చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నామని చెప్తున్న పోలీసులు ముందుగా ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయడం లేదో చెప్పడం లేదని ఆరోపించారు. చైనా పెట్టుబడులను బూచిగా చూపి ప్రజాస్వామ్యాన్ని హరించాలని చూస్తున్నారని ఆరోపించారు. కారణం చెప్పకుండా అరెస్టు చేయడం ప్రాథమిక హక్కుకు భంగం కలిగించడమేనని వారన్నారు. మీడియా సంస్థపైన, జర్నలిస్టుల పైన పాలకులు చేస్తున్న దాడులను ఆపకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఈ. చంద్రశేఖర్, తన్నీరు శ్రీనివాస్, హెచ్ యూజే అధ్యక్ష కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీష్, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నవీన్, రాజశేఖర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



### ఎమ్మార్పీఎస్ పాదయాత్ర

## వాల్ పోస్టర్ విడుదల



ఇబ్రహీంపట్నం-ప్రభాత సూర్యుడు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నిర్వహించ తలపెట్టిన విశ్వరూప మహా పాదయాత్ర గోడపత్రిక ఆవిష్కరణ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ కొమ్ము మహేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎం ఎస్ పి నియోజక వర్గం ఇంచార్జ్ కాళ్ళ పాండు మాదిగ పాల్గొన్నారు.అనంతరం నాయకులు కొమ్ము మహేష్ మాట్లాడుతూ నవంబర్ లో వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కృష్ణ మాదిగ తలపెట్టిన విశ్వరూప పాదయాత్ర(అలంపూర్ నుండి హైదరాబాద్)అక్టోబర్ 7న ప్రారంభం కాబోతుంది కాబట్టి ఎమ్మార్పీఎస్ శ్రేణులు పాదయాత్ర విజయవంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జోగు కృష్ణ,ముత్యాల శివకృష్ణ, జాపాల జంగయ్య,కందికంటి ఆనంద్, ఎంఎస్ఎఫ్ నియోజక వర్గం ఇంచార్జ్ కందికంటి జగన్, జైతారం వినోద్ కుమార్, ఎమ్మార్పీఎస్ నందివనపర్తి ఉపాధ్యక్షులు కొంగరి శివ, ఎమ్మెస్ ఎఫ్ నాయకులు నవీన్ కుమార్, శివ, ప్రవీణ్, ఆదిత్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

### సత్తా చాటిన యువతకు

## అభినందనల వెల్లువ

### బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి

### సర్పంచ్ ఉదయశ్రీ రవీందర్ రెడ్డి



యాచారం-ప్రభాత సూర్యుడు: ఇటీవల వెలువడిన పోలీస్ ఫలితాల్లో నందివనపర్తి గ్రామానికి చెందిన యువత హవా కొనసాగించిన తీరును చూసి బి ఎన్ ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ శేఖర్ రెడ్డి మరియు గ్రామ సర్పంచ్ ఉదయశ్రీ రవీందర్ రెడ్డి హర్షణీయం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని యువతకు ఆదర్శంగా నిలిచినందుకు నంది వనపర్తి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చినందుకు వారి ప్రతిభను గుర్తించి వారిని ఘనంగా సన్మానించారు. ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సాహ పరిచినందుకు వాళ్ళు బి ఎన్ ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ శేఖర్ రెడ్డి కి మరియు గ్రామ సర్పంచ్ ఉదయశ్రీ రవీందర్ రెడ్డి కీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కారోబార్ నూకం మహేందర్, బండి అలెగ్జాండర్, మేకం శంకర్, వంగూరు సాయి, తదితరులు పాల్గొన్నారు.

### అల్పాహారం పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మంచిరెడ్డి



ఇబ్రహీంపట్నం-ప్రభాత సూర్యుడు: ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యార్థులకు ప్రవేశపెట్టిన అల్పాహారం పథకాన్ని ఇబ్రహీం పట్నం మండలం దండుమైలారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రారం భించారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ.ఇది సీఎం కేసీఆర్ మరో చారిత్రక నిర్ణయమని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, సన్నబియ్యంతో రుచికరమైన మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందించేందుకు 'సీఎం బ్రేక్ ఫాస్ట్' పథకాన్ని ప్రారంభించారని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డించి, వారితో కలిసి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, ఎంపీపీ కృపేష్, సర్పంచ్ మల్లీశ్వరి జంగయ్య, పీఏసిఎస్ వెంకట్ రెడ్డి, ఎంఈఓ వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు కోసం కదిలిన నారీమణులు




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ తెలుగు మహిళా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం ముందు మహిళలు ఆందోళనకు దిగారు. కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలిపారు. తెలుగుదేశం పార్టీ మహిళా కమిటీ ఆధ్వర్యంలో "నారా కోసం నారి" అనే నినాదంతో తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్ దగ్గర గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలు భవనం షకీలారెడ్డి , టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి. జ్యోత్స్న, మాజీ ఎమ్మెల్యే కాటగడ్డ ప్రసూన, దివంగత నందమూరి సాయికృష్ణ సతీమణి మధుమణి, ఆయన కూతురు మనస్విని, నందమూరి కుటుంబ సభ్యులు ఈ కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే కాటగడ్డ ప్రసూన రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా షకీలారెడ్డి మాట్లాడుతూ.. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమ కేసులతో చంద్రబాబు నాయుడిని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఆయన ప్రమేయం లేకున్నప్పటికీ చంద్రబాబు నాయుడుపై అక్రమంగా కేసులు బనాయించారు. ఇటీవల పార్టీకి వచ్చిన 27 కోట్ల ఫండ్ విషయంలో కూడా అసత్య ప్రచారం చేస్తున్నారని వైసీపీ పార్టీకి వచ్చిన ఫండ్‌పై శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఎవరెన్నీ కేసులు పెట్టిన చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా త్వరలో జైలు నుంచి బయటకు వస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన వారితో సుప్రీంకోర్టులో కేసు వేయించి న్యాయపోరాటానికి దిగుతానని కాట్రగడ్డ ప్రసూన హెచ్చరించారు.

# పౌష్టికాహారంతో పెరగనున్న ఏకాగ్రత

### ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



భూపాలపల్లి-ప్రభాత సూర్యుడు: పౌష్టికాహారంతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార పథకాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రజా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెడతున్నారని అన్నారు. ఇందులో భాగంగానే తమిళనాడు తరహాలో తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ఉదయం అల్పాహారం (పౌష్టికాహారం) అందించే బృహత్తర కార్యక్రమాన్ని ఎంచుకున్నారని చెప్పారు. దీని ద్వారా పిల్లల్లో ఉత్సాహం నిండి ఉపాధ్యాయులు బోధించే వాటిపై ఆసక్తి చూపుతారని, తద్వారా వారి జ్ఞానం పెరగుతుందని అన్నారు. అలాగే 'మన ఊరు – మన బడి' ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తుందని, తరగతి గదుల్లో 12 రకాల సౌకర్యాలు కల్పించడమే కాకుండా డిజిటల్ తరగతులు ప్రారంభించామని అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని 438 పాఠశాలల్లో సీఎం కేసీఆర్ అల్పాహార పథకాన్ని దసరా సెలవుల అనంతరం ప్రారంభిస్తున్నామని అన్నారు. ఇకపై మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందుతుందన్నారు. పిల్లలు బడికి రాగానే పౌష్టికాహారం అందించడం జరుగుతుందని, తద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువుకోగలుగుతారని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందిస్తామని స్పష్టం చేశారు కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బుర్ర రమేష్, మహిళలు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించండి

### సిఐటియు జిల్లా సహాయ కారదర్శి పి బ్రహ్మయ్య




యాచారం-ప్రభాత సూర్యుడు: మండల కేంద్రంలోని సిఐటియు ఆధ్వర్యంలో చేస్తున్న ఆశ వర్కర్ల నిరవధిక సమ్మె 12వ రోజు చేరిన సందర్భంగా ఆశ వర్కర్లకు కనీస వేతనం 18000 పెంచి ఫిక్స్ వేతనం ఇవ్వాలని టిబి స్కూటమ్ డబ్బాలను ఆశాలతో మోపిచకూడదని, టి బి లెప్రసీ కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, తగ్గించాలని విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పిఆర్సి ఏరియార్స్ వెంటనే చెల్లించాలని, కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు 1000 చొప్పున 16 నెలల బకాయిలు వెంటనే విడుదల చేయాలని, 32 రకాల రిజిస్టర్ ప్రభుత్వం ప్రింట్ చేసి సప్లై చేయాలని, ప్రసూతి సెలవుల పైన సర్కులర్ వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీరి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమంలో ఆశ వర్కర్లు ముక్తా బాయ్ స్వరూప శోభారాణి పద్మ లలిత స్వాతి నాగమణి లక్ష్మమ్మ గరిష జంగమ్మ మమత ముక్తాబాయి బాలమ్మ సువర్ణ నరసమ్మ సుశీల పద్మ బుజ్జి సువర్ణ యాదమ్మ గౌస్య అలివేలు రమాదేవి మంజుల సరూప లలిత గోవిందమ్మ బేగం ప్రమీల వైదేవి బాలమని శోభారాణి గిరిజ సువర్ణ రాణి యాదమ్మ సైదమ్మ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయంలోకి అనుమతి లేదని అడ్డుకున్నారు: ఎమ్మెల్యే

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: నియోజకవర్గ పనుల కోసం తాను సచివాలయానికి వెళ్తుంటే అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయం ప్రధాన ద్వారం ముందు సీతక్కకు చేదు అనుభవం ఎదురైంది. సచివాలయంలోకి అనుమతి లేదని చెప్పడంతో ఆమె కారు దిగి నడుచుకుంటూ లోనికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరి స్తోంద న్నారు. వివిధ శాఖలకు సంబంధించిన పనులపై తాను సచివాలయానికి వచ్చానని, లోపలికి వెళుతుంటే పోలీసులు తనను అడ్డుకున్నారన్నారు. సచివాలయ నిర్మాణాన్ని ఈ ప్రభుత్వం ఎంతో గొప్పగా చూపిస్తోం దని, కానీ ప్రతిపక్ష ఎమ్మెల్యేలనులోనికి ఎందుకు అనుమతించడంలేదని ప్రశ్నించారు. ఇది చాలా అవమానమని, తాను రచ్చ చేయాలి అనుకుంటే చేయగలను.. సమస్యలపై ఇక్కడకు వచ్చానన్నారు. సీఎం కేసీఆర్ ప్రజల మధ్యకు వచ్చేది ఉండదని, పైగా వచ్చే వాళ్లను అడ్డుకుంటున్నారన్నారు.

### ఆశ వర్కర్ల రాస్తారోకో

## సాగర్ రహదారిపై నిరసన




ఇబ్రహీంపట్నం-ప్రభాతసూర్యుడు: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన ఆశాల సమ్మె శుక్రవారం నాటికి 12వ రోజు చేరుకోవడం జరిగింది. సాగర రహదారిపై ఆశ వర్కర్లు రాస్తారోకో చేసి రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. పారితోషకాలు కాకుండా ఫిక్స్ వేతనం 18వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం సమ్మె చేస్తా ఉంటే కేసీఆర్ ప్రభుత్వం పోలీసు యంత్రాంగంతో ఉద్యమాలను ఆపాలని గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించి అక్రమ అరెస్టులు చేశారని ఉద్యమాలు, పోరాటాలు ఆశా వర్కర్లకు కొత్త కాదని తెలిపారు. పెండింగ్లో ఉన్న టిబి, లెప్రసి కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లు వెంటనే చెల్లించాలనివారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, బుగ్గరాములు, ఎల్లేశ, తులసిగారి నర్సింహ, చంద్రకళ, మరియమ్మ, సుకన్య, మణెమ్మ, సునీత,లావణ్య, అమృత, మంజుల,రజిత, కవిత, విజయలక్ష్మి, రమాదేవి, లలిత,నాగమణి, భాగ్యలక్ష్మి, సునీత, కవిత, భాగ్య, అమృత, జయమ్మ, ఫరీదా బేగం, సబిత, రాణి, అనిత, సరిత తదితరులు పాల్గొన్నారు.

### సకల జనుల సంక్షేమమే

## ప్రభుత్వ ధ్యేయం

ఖమ్మం -ప్రభాత సూర్యుడు: సకల జనుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, ఆదిశగానే ముందుకు సాగుతోందని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మైనారిటీబంధు ద్వారా మైనారిటీలకు మంజూరైన చెక్కులను ఆయన గురువారం వీడీవోస్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్షియల్ కార్పొరేషన ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అందిస్తున్న డ్రైవర్ కమ్ ఓనర్ పథకం ద్వారా మంజూరైన రెండు కార్లను, మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఖమ్మానికి మంజూరైన 400 కుట్టుమిషన్లను మహిళలకు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో హిందూ ముస్లిం ఐక్యతను పటిష్ఠం చేస్తూ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మైనారిటీశాఖ ఆధ్వర్యంలో తొలుత 200 కుట్టుమిషన్లు మంజూరు చేస్తే, తాను సీఎంతో మాట్లాడి ఖమ్మానికి ప్రత్యేకంగా 400కుట్టు మిషన్లను మంజూరు చేయించానన్నారు. కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, ఏఎంసీ చైర్మన దోరేపల్లి శ్వేత, రఘునాథపాలెం జడ్పీటీసీ ప్రియాంక, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, కమర్తపు మురళి, పాకాలపాటి విజయ, ఆలియ, మక్బూల్, చిరుమామిళ్ల లక్ష్మి, పగడాల శ్రీవిద్య, వలరాజు, పాలెపు విజయ తదితరులున్నారు. దీంతోపాటు మంత్రి పువ్వాడ అజయ్ గురువారం పలు డివిజన్లలో పర్యటించి రూ.2.10కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో జరిగిన అభివృద్ధి ఎక్కడా జరగలేదన్నారు. అనంతరం భక్తరా మదాసు కళాక్షేత్రంలో గృహలక్ష్మి పథకం కింద మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.

## నర్సుల సంబరాలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: నర్సుల హోదా పెంచుతూ ఉత్తర్వులు జారీ అయిన నేపథ్యంలో గురువారం రాష్ట్రంలోని పలు ఆస్పత్రులు, వైద్య కార్యాలయాల వద్ద నర్సులు సంబరాలు జరుపుకు న్నారు. అనేక సంవత్సరాలుగా నర్సులు తమ హోదా మార్పు కోసం ప్రభుత్వానికి చేసుకున్న వినతిని ఎట్టకేలకు రాష్ట్ర సర్కారు మన్నించింది. ఉస్మానియా, గాంధీ తదితర ఆస్పత్రులతో పాటు హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ వద్ద ప్రభుత్వ నర్సులు వేడుకను నిర్వహించారు. ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్ కు, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావుకు కతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ చర్య ప్రజారోగ్య వ్యవస్థలో నర్సుల గౌరవాన్ని పెంచేదిగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. 1919లో సిస్టర్స్ అనీ, 1956లో మద్రాస్ రాష్ట్రంలో ప్రచురించిన హాస్పిటల్ స్టాండింగ్ ఆర్డర్‌లో స్టాఫ్ నర్సులుగా పిలవబడ్డారు. వేడుకల్లో నర్సింగ్ డీడీ విద్యులత, నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ విద్యావతి, ఉస్మానియా వైద్యశాల గ్రేడ్–1 సుజాత రాథోడ్, నర్సింగ్ ఆఫీసర్లు లక్ష్మణ్ రుధావత్, విద్యాసాగర్, రవి నాయక్, క్రిష్ణ, నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215